క్లుప్తంగా

దాతల సహకారం అభినందనీయం

డీసీ గోగినేని లీలాకుమార్



పెదకాకాని: శివాలయం అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ అన్నారు. పెదకాకాని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలోని రాహుకేతు మండపంలో కొబ్బరికాయలు కొట్టేందుకు వీలుగా బుధవారం స్టాండ్ ఏర్పాటు చేశారు. రూ.50 వేలు విలువ కలిగిన ఈ స్టాండ్‌ను గ్రామానికి చెందిన కొల్లి మల్లికార్జునరావు, కనకదుర్గాభవాని దంపతులు శివాలయం డీసీ గోగినేని లీలాకుమార్‌కు అందజేశారు. దాతలకు ప్రత్యేక దర్శనము చేయించి స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పేటేటి ధనమహేశ్వరప్రసాద్, మనోజ్, సిబ్బంది సాదినేని శ్రీనివాసరావు, యంపరాల బసవ శంకర్‌లు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో భావదేవునికి ఊంజల్ సేవ



పొన్నూరు: పట్టణంలోని శ్రీసుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణస్వామి వారికి బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ నిర్వహించారు. గోవర్ధనం రామకృష్ణ పర్యవేక్షణలో అర్చకులు కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ లోక కల్యాణార్థం స్వామికి శాంతి కల్యాణం, ఊంజల్ సేవ, హోమాలు నిర్వహించామని అన్నారు. లోకం సుభిక్షంగా, పంటలు పుష్కలంగా పండి ప్రజలందరూ సుఖశాంతులతో ఉండేందుకు ఈ ఉత్సవాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రొఫెసర్ రత్న షీలామణికి అభినందనలు



పెదకాకాని(ఏఎన్‌యు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగ ఆచార్యులు, ప్రస్తుత వర్సిటీ ఇన్‌చార్జి రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్న షీలామణికి వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ జి.సింహాచలం, ఉన్నతాధికారులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు బుధవారం అభినందనలు తెలిపారు. ఆమె రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా నియమితులవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. కాగా ఆమె మూడేళ్లపాటు ఈ పదవిలో ఉంటారు.

అక్టోబర్ 18న సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్



పెదకాకాని(ఏఎన్‌యు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అక్టోబర్ 18న సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఎక్స్ బేస్ సంస్థ సీఈఓ గంటా స్వామి తెలిపారు. మారుతున్న నేటి సమాజంలో కంప్యూటరీకరణ, సాంకేతిక పరిజ్ఞానంలో భాగంగా హైదరాబాద్ ఎక్స్ బేస్ సైబర్ సెక్యూరిటీ సంస్థ బుధవారం వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావును కలిసి వినతిపత్రం అందజేసి అనుమతి పొందారు. వీసీ ఆచార్య గంగాధరరావు ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేయుటకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. బిగ్ డేటా, చాట్ జీపీటీ, ఎథికల్ హ్యాకింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐపై మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు, ఉద్యోగులు, పారిశ్రామిక వేత్తలు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపేందుకు ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఈఓ గంటా స్వామి తెలిపారు. ఈ వర్క్‌షాప్‌ను విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఎక్స్ బేస్ సంస్థ సీఈఓ కోరారు.

పోస్టాఫీస్ ఆకస్మిక తనిఖీ

తెనాలిరూరల్: తెనాలి హెడ్ పోస్టాఫీస్, తెనాలి డివిజనల్ కార్యాలయాన్ని విజయవాడ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అందిస్తున్న సేవలు, ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. బీమా సంకల్ప్ పోస్టల్ ఇన్సూరెన్స్ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. ఆయన వెంట పోస్టల్ సూపరింటెండెంట్ జీవీ బాలసరస్వతి, ఇతర అధికారులు ఉన్నారు.

అడుగడుగునా గుంత.. అదే యాతన

- కనీస మరమ్మతులకు నోచుకోని పొన్నూరు–రేపల్లె రోడ్డు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు
- వర్షం పడితే మరింత అధ్వానంగా తయారవుతున్న వైనం



డంపింగ్ యార్డు వద్ద గుంతలతో అధ్వానంగా ఉన్న పొన్నూరు–రేపల్లె రోడ్డు

పొన్నూరు: నియోజకవర్గ కేంద్రం పొన్నూరు నుంచి వివిధ పట్టణాలకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటు గ్రామాలకు అనుసంధానంగా ఉండే పలు రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో పలు గ్రామాల్లో రోడ్లు గుంతలమయం కావడంతో వర్షాకాలంలో ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. అధ్వానంగా ఉన్న రోడ్ల అభివృద్ధిని అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వస్తున్నాయి. ప్రమాదకరంగా ఉన్న రోడ్లపై ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు.

- ముఖ్యంగా పొన్నూరు నుంచి రేపల్లె వెళ్లే రహదారి విపరీతమైన నిర్లక్ష్యానికి గురవుతోంది. పొన్నూరు పట్టణ పరిధిలోని డంపింగ్ యార్డు వద్ద గుంతలమయంగా మారింది. వర్షం కురిసినప్పుడు ఆ గుంతలలో నీరు నిలిచిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనచోదకులు, ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. గుంతల బాధతో పాటు దుమ్ముతో ఇబ్బంది పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.
- ఈ రహదారిలో చందోలు, చెరుకుపల్లి పట్టణాలు కూడా ఉండటంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రేపల్లె నుంచి పొన్నూరు, గుంటూరుకు వివిధ అవసరాల నిమిత్తం నిత్యం వందల మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రస్తుతం ఈ రహదారి గోతులమయమై ప్రమాదకరంగా మారింది. రాత్రిళ్లు ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడుగడుగునా ఉన్న గుంతలలో ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని వాపోతున్నారు. అడిగితే ఇదిగో అదిగో అంటూ అధికారులు మభ్యపెడుతున్నారే తప్ప రోడ్డు అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయే తప్ప ఆచరణలో ఉండడం లేదని పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఏఐ ఆధారిత బ్యాంకింగ్ సేవలపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సీనియర్ వైస్ చైర్మన్ రావు, విద్యార్థులు

గుంటూరు రూరల్: కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత బ్యాంకింగ్ సేవలు భవిష్యత్‌లో విశ్వసనీయత, పారదర్శకతను పెంపొందించి ఆర్థిక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సీనియర్ వైస్ చైర్మన్ టీవీఎస్ రావు చెప్పారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ది ఫ్యూచర్ ఆఫ్ ఇండియన్ బ్యాంకింగ్ ఫిన్‌టెక్స్, ఏబీఎఫ్‌సీలు ఏఐ ఇన్ ఆన్ ఎంటర్‌ప్రెన్యూరియల్ ఎరా అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌కి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో బ్యాంకింగ్ రంగంలో నిర్వహించబడుతున్న కార్యకలాపాలు, భవిష్యత్‌లో ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో చోటు చేసుకోనున్న పరిణామాల గురించి వివరించారు. బిజినెస్ మేనేజ్మెంట్ విద్యార్థులకు విశేష అవకాశాలు ఉన్నాయని, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో వీరి పాత్ర కీలకమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని లు తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థి అయిన టీవీఎస్ రావు అత్యున్నత స్థాయిలో బ్యాంకింగ్ రంగంలో సేవలందిస్తూ, తమ కళాశాలకు అతిథిగా రావడం గర్వకారణమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ సీహెచ్ బాలనాగేశ్వరరావు, డాక్టర్ టి.శ్రీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ అంటే భయం వద్దు



స్వస్థ నారీ స్వశక్త పరివార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామాంజనేయులు, వైద్యాధికారులు



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు: క్యాన్సర్ అంటే మహిళలు భయపడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం స్వస్థ నారీ స్వశక్త పరివార్ అభియాన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసమే నూతన పథకం అమలు చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఎక్కువ సంఖ్యలో కొత్త క్యాన్సర్ కేసులు బయట పడుతున్నాయని చెప్పారు. బీపీ షుగర్ పరీక్షలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో, అలాగే క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. క్యాన్సర్ అంటే భయపడాల్సిన పనిలేదు ముందుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ ఇన్‌చార్జి ప్రవీణ్, గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యూనిస్, వైద్యాధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ్ మాసోత్సవాలను ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో జి.విజయలక్ష్మి, అడిషనల్ సీడీపీవో సీహెచ్ విజయనిర్మల, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

కాకుమాను: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ కాకుమాను సెక్టార్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం స్వస్థ నారీ స్వశక్త పరివార్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ గర్భిణులు ప్రతి రోజు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని అప్పుడే తల్లీ శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంటవెంటనే దేవుడు పిల్లల్నిచ్చాడు పుట్టారు అంటారు

గుంటూరు: కడుపున పుట్టిన బిడ్డకు ఆరునెలలు రాకుండానే మహిళ గర్భం దాల్చితే క్యాన్సర్ రాకుండా ఏమి వస్తుందని గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బూర్ల దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మహిళలకు వస్తున్న క్యాన్సర్ వ్యాధిని ఉద్దేశించి మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. 'సరైన సమయంలో పరీక్షలు చేయించుకోకుంటే మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వస్తాయన్నారు. పిల్లలకు జన్మనిచ్చిన తరువాత వారిని అన్ని విధాలా జాగ్రత్తగా చూసుకోవలసిన ప్రధానంగా భర్తపై ఉందన్నారు. నేను స్వేచ్ఛగా చెబుతున్నాను. ఇది మనం దాచి పెట్టే అంశం కాదు. కనీసం ఆరు నెలలు సంసార జీవితానికి దూరంగా ఉండాలి. అప్పుడే పుట్టిన బిడ్డతో సతమతమవుతున్న బాలింతను మరలా సంసారానికి రావాలని రెండు నెలలకో, మూడు నెలలకో బలవంతం చేస్తున్న పురుషులు ఈ సమాజంలో ఇంకా అక్కడక్కడా ఉంటున్నారంటే సిగ్గుపడాలన్నారు. మొదటి బిడ్డకు రెండవ బిడ్డకు కనీసం రెండు సంవత్సరాలు గ్యాప్ ఉండాలని సైన్స్ చెబుతుందని, సాంకేతిక పరిజ్ఞానం చెబుతుందని అన్నారు. వెంట వెంటనే పిల్లలు దేవుడిచ్చాడు పుట్టారు అంటారు. దేవుడెలా ఇస్తారు.. మనం పడుకోకుండానే దేవుడిస్తారా.. దయచేసి మగవాళ్లు ఆలోచించండి కడుపున పుట్టిన బిడ్డకు ఆరునెలలు రాకుండా మహిళ గర్భం దాల్చితే క్యాన్సర్ రాకుండా ఏమి వస్తుందని చెప్పారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం, ఇప్పటం గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసరాల ధరలతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, పారిశుద్ధ్య కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌లో చేర్చని పారిశుద్ధ్య కార్మికులకు వెంటనే ఆప్కాస్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని సంక్షేమ పథకాలను ఆంక్షలు లేకుండా పారిశుద్ధ్య కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇప్పటం, వడ్డేశ్వరం పారిశుద్ధ్య గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గరిగ జ్యోతి, కార్యదర్శిగా కాకి బాబు, సహాయ కార్యదర్శిగా సరోజమ్మ, కోశాధికారిగా రమేష్‌లను, ఇప్పటం పారిశుద్ధ్య గ్రామ అధ్యక్షుడిగా సాంబశివరావు, కార్యదర్శిగా జి.పిచ్చయ్య, కమిటీ సభ్యులుగా కోటయ్య, అలివేలు, పోలయ్యలను ఎన్నుకున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ షేక్ పర్వీన్ సుల్తానా ఆధ్వర్యంలో రక్షిత మంచినీటి ట్యాంక్ వద్ద పరిసరాలను పరిశుభ్రం చేయించారు. గ్రామంలోని ఓహెచ్ ఆర్ ట్యాంక్ సహా అంతర్గత వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. ప్రస్తుతం వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, ప్రబలుతున్న వైరల్ జ్వరాల నేపథ్యంలో గ్రామంలోని ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు, తాగునీరు కలుషితం కాకుండా ఉండేందుకు వాటర్ ట్యాంక్ పరిసరాలు శుభ్రం చేయించడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. సీజనల్ వ్యాధులు, జ్వరాల బారిన పడకుండా గ్రామస్తులు తగిన జాగ్రత్తలు పాటించాలని షేక్ పర్వీన్ సుల్తానా నూరుల్లా కోరారు.

కుక్కల దాడిలో విద్యార్థికి తీవ్రగాయాలు





చేబ్రోలు: గ్రామ సింహాలు దాడి చేయటంతో చిన్నారికి గాయాలైన ఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో బుధవారం జరిగింది. వడ్లమూడి గ్రామంలోని పోస్టాఫీసు రోడ్డులో నివసించే వరికూటి గోపీకృష్ణ కుమారుడు వరికూడి ధనుష్ ఇంటి నుంచి బయటకు వచ్చి సమీపంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న ప్రాంతానికి వెళ్తుండగా కుక్కలు వెంబడించాయి. నాలుగు వీధి కుక్కలు కాళ్లు, చేతులు, వీపు, నడుము తదితర 15 చోట్ల కరిచాయి. కుక్కల దాడిని గమనించిన ఆడుకుంటున్న యువకులు ధనుష్‌ను రక్షించారు. తృటిలో ప్రాణపాయం నుంచి బయటపడిన చిన్నారిని కుటుంబ సభ్యులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లి వైద్య చికిత్స అందజేశారు. మండల పరిధిలోని గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. వాహనదారులను కుక్కలు వెంబడించి గాయపరుస్తున్నాయి. చేబ్రోలు గ్రామంలో శునకాలు ప్రజలను భయపెడుతున్నాయి. ప్రతి బజారులో కుక్కల స్వైర విహారం చేస్తుండటంతో గ్రామస్థులకు ప్రాణ సంకటంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి కుక్కల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ జట్టుకు వేజండ్ల విద్యార్థినులు



వేజండ్ల(చేబ్రోలు): చేబ్రోలు మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇరువురు విద్యార్థినులు బీచ్ వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హైస్కూల్ పీడీ దాసరి విజయదుర్గ బుధవారం తెలిపారు. బాపట్ల జిల్లా ముత్తాయిపాలెం హైస్కూల్‌లో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్–14 బీచ్ వాలీబాల్ జిల్లా జట్టు ఎంపికలో వేజండ్ల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థినులు యంపరాల నందిని, జోగిపర్తి నాగూర్‌బీలు ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. అక్టోబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అండర్–14 బీచ్ వాలీబాల్ పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను హెచ్‌ఎం కే గౌరేశ్వరీదేవి, పీడీ దాసరి విజయదుర్గ, పీఈటీ తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్–2025కు విశేష స్పందన



గెలుపొందిన వారికి బహుమతులను అందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసబాబు

చేబ్రోలు: భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్–2025 పోటీలకు విశేష స్పందన లభించిందని చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస బాబు తెలిపారు. బుధవారం విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో జరిగిన స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ పోటీలలో వివిధ ప్రాంతాలకు చెందిన 39 జట్లు పాల్గొని 203 సమస్య ప్రకటనలకు కొత్త ఆలోచనలతో పరిష్కార మార్గాలను సమర్పించారు. దీనిలో భాగంగా నిర్వహించిన ఇంటర్నల్ రౌండ్ విజయవంతంగా జరిగింది. విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల టీం విజయం సాధించింది. 30 టీంలు జాతీయ స్థాయిలో ఫైనల్ పోటీలకు ఎంపికయ్యాయి. కేసీ ఓవర్సీస్ స్పాన్సరింగ్ మద్దతు అందించింది. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు మెమెంటో, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జ్యూరీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆవిష్కరణలు సమాజహితంగా ఉండాలి

కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తదితరులు

ప్రత్తిపాడు: విద్యార్థులు చేసే ఆవిష్కరణలు సమాజహితంగా ఉండాలని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్‌ఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కిట్స్) కళాశాలలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2025ను నిర్వహించారు. హ్యాకథాన్‌లో 165 జట్లు పాల్గొన్నాయి. ఐటీ, వ్యవసాయం, ఆరోగ్యం, స్మార్ట్ సిటీలు, విద్య, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ అభివద్ధి వంటి అనేక కీలక రంగాలకు చెందిన 18 థీమ్‌లు, 135 సమస్యా ప్రకటనలపై విభిన్న కాన్సెప్ట్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సృజనాత్మక ఆలోచనలతో కొత్త పరిష్కారాలను ఆవిష్కరించాలన్నారు. హ్యాకథాన్‌లు ఉద్యోగావకాశాల కల్పనకు దోహదపడతాయన్నారు. కళాశాల కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ హ్యాకథాన్‌లు కేవలం విద్యార్థుల్లోని సాంకేతిక ప్రతిభను వెలికితీసేందుకే కాకుండా సమస్యకు పరిష్కార మార్గాలు సూచించేందుకు ఉపకరిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబులు మాట్లాడుతూ 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలు యువతలో పరిశోధనా దృక్పథాన్ని పెంచుతాయని చెప్పారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

చేబ్రోలులో 19న యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి

చేబ్రోలు: ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్ ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు రణభేరి కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా 19వ తేదీన చేబ్రోలు మండలంలో రాష్ట్ర వ్యాప్త జాత కార్యక్రమం జరుగుతుందని యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కావటం లేదని ఇప్పటి వరకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాఠశాలల సమస్యలను పరిష్కరించకపోగా నూతన సమస్యలను సృష్టిస్తూ విద్యార్థుల చదువులకు ఇబ్బందులు కలిగిస్తుందన్నారు. ఉపాధ్యాయులపై బోధనేతర పనులు పెరిగిపోయాయని అన్నారు. ప్రభుత్వం ఎన్నికలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. ఈ సందర్భంగా రణభేరి పోస్టరును ఆవిష్కరించారు. ఈ నెల 19న చేబ్రోలులో జరుగుతున్న రణభేరీ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మీటింగ్ ప్రధాన కార్యదర్శి పార్థసారథి, శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, శివ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీ రంగా వర్సిటీలో విశ్వకర్మ జయంతి



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో బుధవారం దైవిక వాస్తు శిల్పి విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మీదేవి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ, అధికారులు విశ్వకర్మ చిత్రపటానికి పూలు సమర్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చేపట్టాలి

పొన్నూరు: మండలంలోని దండమూడి, మునిపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్ పాల్గొని ప్రస్తుతం వరి పైరులో కనిపిస్తున్న ఆకు ముడత పురుగును గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. వరి పైరు 60 నుంచి 70 రోజుల దశలో ఉందని నత్రజని ఎరువుతో పాటు పొటాష్ ఎరువు ఎకరాకు 20 కిలోలు కలిపి వినియోగించాలని సూచించారు. దీంతో రోగనిరోధక శక్తి పెరిగి నాణ్యమైన పంట దిగుబడులు పొందవచ్చని తెలిపారు. రైతులు తప్పనిసరిగా ఈ నెలాఖరుకు ఈ పంట నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సీహెచ్ రూప, సుప్రజ, పి.మాణిక్యరావు, ఎంపీఈవో ఎస్.సురేష్ బాబు, రైతులు పాల్గొన్నారు

గులాబీ రంగు పురుగు నివారణకు సూచనలు

ప్రత్తిపాడు: వేప గింజల కషాయంతో గులాబీ రంగు పురుగుల ఉధృతికి అడ్డుకట్ట వేయవచ్చని ప్రత్తిపాడు ఏవో షేక్ సుగుణ బేగం అన్నారు. ప్రత్తిపాడు, తిక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక రైతులతో కలిసి పత్తి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పత్తిలో గులాబీ రంగు పురుగులు ఎక్కువగా ఉన్నాయని రైతులు వాపోయారు. ఏవో సుగుణ బేగం పురుగుల నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి పంటలో గులాబీ రంగు పురుగులు గమనించిన రైతులు ఎకరానికి 8 నుంచి 10 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. గులాబీ రంగు పురుగు నివారణకు 5 శాతం వేప గింజల కషాయం లేదా వేప నూనె 5 మి.లీ. లేదా ప్రొఫినోఫాస్ 2 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా క్వినాల్ ఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటిలో కలుపుకుని పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు వై.నీలంబరం, ప్రవీణ్ కుమార్, కె.లావణ్య, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రత్తిపాడు: డిజిటల్ లావాదేవీల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని జీడీసీసీ బ్యాంక్ స్టాఫ్ అసిస్టెంట్ విష్ణువర్ధన్ అన్నారు. ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెంలో బుధవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో డిజిటల్ ఫైనాన్షియల్ లిటరసీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిబిఆర్‌సి కోఆర్డినేటర్ పి.నిర్మల అధ్యక్షతన జరిగిన సమావేశంలో జీడీసీసీ బ్యాంక్ స్టాఫ్ అసిస్టెంట్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ ద్వారా నాణ్యమైన ఆర్థిక సేవలను పొందవచ్చన్నారు. యూనియన్ బ్యాంక్ ట్రైనింగ్ సెంటర్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ అంజలి మాట్లాడుతూ పబ్లిక్ వైఫై ద్వారా బ్యాంకింగ్ లావాదేవీలు చెయ్యకూడదన్నారు. నిర్మల మాట్లాడుతూ రైతులకు తైవాన్ మిషన్లు, ఉత్పత్తిదారుల సంఘాల గురించి వివరించారు. మాజీ జెడ్పీటీసీ డి.భాగ్యారావు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.